క్లుప్తంగా

సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి వరుణ్, కమల్, శ్రావణ్‌కుమారులు రాష్ట్రస్థాయిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో సత్తాచాటారు. అండర్-14 విభాగంలో జిల్లా టీమ్‌లో పాల్గొన్న వీరు సత్యసాయి జిల్లా హిందూపురంలో అక్టోబర్ 25, 26, 27 తేదీల్లో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో ఆడారు. దీంట్లో రన్నర్స్‌గా జిల్లా టీమ్ నిలిచింది. ఈ టీమ్‌లో ఉన్న నరసన్నపేట స్కూల్ విద్యార్థులు ముగ్గురు తమ సత్తాను చాటి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారని స్కూల్ హెచ్‌ఎం పైడి వెంకటరావు తెలిపారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాలలో సత్కరించారు.

రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని కలిగాం పంచాయతీ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సనపల కోటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు లేని వీధులకు దశలు వారీగా నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో మేలు



ద్రవ జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: ద్రవ జీవామృతం వినియోగించడం వలన మొక్కల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మహసింగూడలో ఏటీఎం విధానం ద్వారా సాగు చేస్తున్న పలు రకాల పంటలను పరిశీలించారు. అలాగే ద్రవ జీవామృతం తయారు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం వినియోగించడం వలన మొక్కలకు పట్టిన చీడపీడలను నాశనం చేస్తుందన్నారు. పంటకు అవసరమైన సూక్ష్మజీవులను వృద్ధి చేయడంతో పాటు మొక్కలకు కావాల్సిన పోషక విలువలు అందించడంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం కూర్మారావు

హిరమండలం: మహిళా సంఘాలకు గ్రామ సంఘం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఉన్నతి, శ్రీనిధి రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీఎం పి.కూర్మారావు సూచించారు. మండలంలోని పింద్రువాడ, అంబావల్లి గ్రామాల్లో మహిళా సంఘ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణాలకు శాతశాతం రీ పేమెంట్ ఉండాలని స్పష్టం చేశారు. ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ సాయిరాం, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుజాత, విజయకుమార్, వీవోఏలు పాల్గొన్నారు.

రఘువర్మ గెలుపునకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న అమ్మినాయుడు

ఆమదాలవలస: ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ గెలుపునకు అందరం సమష్టిగా కలిసి కృషి చేద్దామని ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు పి.అమ్మినాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రఘువర్మ గెలుపుతో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో సభ్యులు బి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, టి.సూర్యనారాయణ, బి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు మంగళం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

- వైఎస్సార్‌సీపీ హయాంలో స్పెషలిస్టు డాక్టర్లతో సేవలు
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- ప్రస్తుతం ఊసెత్తని వైనం



వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

హిరమండలం: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.

పడకేసిన పల్లె వైద్యం

కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. ఆధునిక వైద్య సేవలకు పల్లె ప్రజలు క్రమేపీ దూరమవుతున్నారు. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేసింది. ఇందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫార్సులను పంపేవారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనూ పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతీ శిబిరానికి సుమారు ఐదుమంది స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ కూడా శిబిరంలోనే తీసేవారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో గత ప్రభుత్వం అమలుచేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇబ్బందులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– డి.సుందరమ్మ, సర్పంచ్, హిరమండలం మేజర్ పంచాయితీ

ఆదేశాలు లేవు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై ఇంతవరకు ఆదేశాలు లేవు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్ సాయిగీత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

ఆనందాల కేళి.. దీపావళి



పొందూరు: బీసీ బాలికల వసతి గృహంలో లక్ష్మీదేవికి తొమ్మిది రకాల నైవేద్యాలు సిద్ధం చేసిన చేసిన విద్యార్థినులు

వెలుగుల పండుగ దీపావళిని గురువారం రాత్రి ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయబద్ధంగా ఇళ్లల్లో మహాలక్ష్మి పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి మతాబులు కాల్చుతూ సందడి చేశారు. బాణసంచా వెలుగులతో పల్లెలు, పట్టణాలు మెరిసిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్



పొందూరు: బీసీ బాలికల వసతి గృహంలో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



కొత్తూరు: బాణసంచా కాల్చుతూ సరదాగా గడుపుతున్న కుటుంబ సభ్యులు



పాతపట్నం: షిర్డీసాయి మందిరంలో దీపాలంకరణ

ఉపాధి పనుల ప్రజా వేదిక నేడు

సారవకోట: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శనివారం మండల పరిషత్ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ 23.19 కోట్లు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్, వేతన రూపంలో చెల్లించడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారని, శనివారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● వాహనదారులకు తిప్పలు



ఎల్.ఎన్.పేట మండలంలోని ఏబీ రోడ్డు నుంచి కొత్తబాలేరు గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పశువుల నిలయంగా మారిపోయింది. ఏబీ రోడ్డు నుంచి కొత్తబాలేరు గిరిజన గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డులో చింతల బడవంజ, డొంకల బడవంజ, కవిటి, కొత్తపేట గ్రామాలు ఉన్నాయి. డొంకల బడవంజ గ్రామం వద్ద రోడ్డుపైనే పశువులను కట్టేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామస్తులతో పాటు పలువురు ప్రయాణికులు చెపుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపైన పశువులు కట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

● నిరుపయోగం



కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ట్యాప్‌లు పని చేయడం లేదు. ఇక్కడ రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులకు తాగునీరు అందడం లేదు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి తాగునీటి ట్యాప్‌లకు నీరు సరఫరా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కేవలం ఏర్పాటు చేసి వదిలేయడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదని పేర్కొంటున్నారు.

- కొత్తూరు

● అపారిశుద్ధ్యం



సరుబుజ్జిలి మండలంలోని చినకాగితాపల్లి పంచాయతీ పరిధి బుడ్డివలస గ్రామంలో అపారిశుద్ధ్యం నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నెలలు తరబడి రహదారులపై నిల్వ అవ్వడం వలన ఈగలు, దోమలు చేరి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై కనీసం దృష్టిసారించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

● పనుల్లో కదలిక



పాతపట్నం జాతీయ రహదారిలో పాతపట్నం అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణంలో కదలిక వచ్చింది. శుక్రవారం పనులను అధికారులు మరలా చేపట్టారు. సర్వీస్ రోడ్డుకు కావాల్సిన రహదారి నిర్మాణం చేపడతామని ఇంజినీర్లు తెలిపారు. ఇప్పటికే తిలారు, పాతపట్నం ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అయితే వేగవంతంగా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- పాతపట్నం

అమరజీవి కృషి మరువలేనిది



సారవకోట: తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు వేషధారణల్లో విద్యార్థులు



నరసన్నపేట: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: ఆంధ్రరాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, పొందర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజాపు అప్పన్న, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, జమ్ము సర్పంచ్ వాన గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, రావాడ రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలుమూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని వైద్యుడు శంకర్ అన్నారు. మండల కేంద్రం జలుమూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మెండ రామారావు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు.



జలుమూరు: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ మోహన్‌గాంధీ ఆధ్వర్యంలో విద్యార్థులు తెలుగు తల్లిగా కర్ర బ్రహ్మణి, పొట్టి శ్రీరాములుగా గుండు మోహిత్‌లు అలరించారు.

ఆలయాలకు బల్బుల వితరణ

బూర్జ: మండలంలోని అయ్యవారిపేట రామాలయం, తోటవాడ శివాలయానికి బల్బులను తన సొంత నిధులతో అందజేసినట్లు జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జయరాం తెలియజేశారు. కార్తీక మాసంలో భక్తులు, అయ్యప్ప స్వాముల స్నానాలు దృష్టిలో ఉంచుకొని దేవాలయాల ప్రధాన అర్చకులకు శుక్రవారం అందజేసినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు తూర్పుకాపు రాష్ట్ర యువజన అధ్యక్షులు శ్రీనివాస్, మండల జనసేన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మందుగుండు సామాగ్రి సీజ్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో అనుమతి లేకుండా విక్రయాలు చేస్తున్న మందుగుండు సామాగ్రిని సీజ్ చేశామని హెచ్‌సీ దాలినాయుడు శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి తనిఖీలు చేయగా, అనుమతి లేకుండా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించి రూ.27,250లు విలువ కలిగిన సామాగ్రిని పట్టుకున్నామన్నారు. దీనికి సంబంధించి బోయిన నాగరాజుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అంకితభావానికి నిదర్శనం సత్యనారాయణ

- డీవీఈవో శివ్వాల తవిటినాయుడు

హిరమండలం: వృత్తిపై అంకితభావం, క్రమశిక్షణకు నిదర్శనం పీఈ సత్యనారాయణ పట్నాయక్ అని ఇంటర్మీడియట్ విద్య డీవీఈవో శివ్వాల తవిటినాయుడు కొనియాడారు. హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న పక్కి ఈశ్వర సత్యనారాయణ పట్నాయక్, ఉద్యోగ విరమణ చేయడంతో సమావేశాన్ని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీవీఈవో తవిటినాయుడు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య పబ్లిక్ పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్ సమయంలో సత్యనారాయణ పట్నాయక్ రెండు దశాబ్దాలకుపైగా గణనీయమైన సేవలు అందిస్తూ వస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో ప్రగడ దుర్గారావు మాట్లాడుతూ పనిపట్లపై అంకితభావంతో నిత్య విద్యార్థిలా ఉంటూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం ఆరోగ్యవంతంగా, కుటుంబంతో ఆనందంగా గడపాలని పలువురు వక్తలు, విశ్రాంత అధికారులు, ప్రిన్సిపాల్స్ ఆకాంక్షించారు. తనకు అన్నివిధాలుగా సహకరించిన అధికారులకు, అధ్యాపకులకు, వెన్నంటే ఉంటూ బాసటగా నిలిచిన కుటుంబ సభ్యులకు పీఈఎస్ పట్నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీఈఎస్ పట్నాయక్, సూర్యకాంతం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు కోట ప్రకాశరావు, సురంగి మోహనరావు, ప్రిన్సిపాల్స్ బి.శ్యామ్‌సుందర్, పీవీఎల్ నారాయణరావు, ఎం.కృష్ణవేణి, జె.సునీత, పీఎల్ఎన్‌పీ పట్నాయక్, విశ్రాంత ప్రిన్సిపాల్స్ ఎండీ యాసీం, పేడాడ రాంబాబు, చౌదరి ఆదినారాయణ, పి.రామ్‌మనోహర్, ఆర్.భూషణరావు తదితరులు పాల్గొన్నారు.



పీఈ సత్యనారాయణ పట్నాయక్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పొలంగట్లపై కూరగాయల సాగు

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతుల వరి పొలంగట్లపై బహుళ పంటల కూరగాయల సాగును చేపట్టారు. ఈ సందర్భంగా డిజిటల్ ఎల్టు సురేష్ మాట్లాడుతూ వరి పొలం గట్లపై ఏ-గ్రేడ్ మోడల్ పద్ధతిలో కూరగాయలను సాగు చేయడం వలన, రైతులకు ఇంటి అవసరాలకు సరిపడా కాయగూరలతో పాటుగా అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఇదేవిధంగా రైతులతో పలు పంటల విధానంలో పంటలు సాగు చేసుకుంటే పంటల్లో జీవ వైవిధ్యత ఏర్పడి అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అదనపు ఆదాయాన్ని చేకూర్చుకునే విధంగా పలు రకాల మోడల్స్ పద్ధతిని తెలియజేస్తూ క్షేత్రస్థాయిలో పనిచేయిస్తున్నామని యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు.



కూరగాయలు చూపిస్తున్న రైతులు

పేదల పెన్నిధి ఇందిరాగాంధీ

ఆమదాలవలస: దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదల పెన్నిధి అని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గేటులో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆమె చేసిన కృషి మరవలేనిదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, పైడి శ్రీరాములు, లఖినేని నారాయణరావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, అప్పారావు, శ్రీను, నాయుడు, రాజశేఖర్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి తదితరులు

నరసన్నపేట: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని కార్యకర్తలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ భారతదేశ ఉక్కు మహిళగా పేరొందిన ఆమె, ప్రపంచంలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే అనుమతులు రద్దు



మద్యం నిల్వలు పరిశీలిస్తున్న ఎస్ఐ కావ్య

ఎల్.ఎన్.పేట: మద్యం అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడినా, అధిక ధరలకు విక్రయించినా అనుమతులు (లైసెన్స్) రద్దు చేస్తామని ఆమదాలవలస ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ జె.కావ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం నిల్వలు, వాటి ధరలు, ఇతర వివరాలు తెలియజేసే బోర్డులు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. మద్యం షాపులు వద్ద లూజు అమ్మకాలు, బెల్ట్ షాపులను ప్రోత్సహించడం చేయవద్దన్నారు. షాపుల్లో నిల్వలు, వాటి ధరలు, అమ్ముతున్న తీరును పరిశీలించారు. ఆమెతో పాటు ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.